కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



డ్రైనేజీ లైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ

దుండిగల్: కాలనీలు, బస్తీల్లో మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా పని చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ఆదివారం దుండిగల్ మున్సిపల్ 15వ వార్డులోని ప్రణీత్ ఫ్లోరా కాలనీలో ఎమ్మెల్సీ పర్యటించారు. ఇటీవల కాలనీలో తాగునీటి కనెక్షన్లు ఏర్పాటు చేయించిన శంభీపూర్ రాజుకు కాలనీ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. స్థానిక సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ భరత్‌కుమార్, కాలనీ ప్రెసిడెంట్ నాగమణి, వైస్ ప్రెసిడెంట్ హరీష్, సభ్యులు పెద్దినేని, నాగరాజు, ఫ్లోరా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్.. కేసు నమోదు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి పలువురిపై కేసును నమోదు చేశారు. బాలానగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఐడీపీఎల్ చౌరస్తా వద్ద నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురు పట్టుబడ్డారు. అదే విధంగా జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో మొత్తం 14 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ దొరికిపోయారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు సైతం దూలపల్లి, పేట్‌బషీరాబాద్ ప్రాంతాల్లో 19 మంది పట్టుబడ్డారు. వీరిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు

భార్యతో గొడవపడి వెళ్లిపోయిన భర్త

కుత్బుల్లాపూర్: భార్యతో గొడవ పడి భర్త ఇంటి నుండి వెళ్లిపోయిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. దూలపల్లి ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ జుబేర్(29) ఈ నెల 7వ తేదీన భార్యతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో అతని అన్న ఇర్ఫాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వస్వతి పుష్కరాల జలం పంపిణీ



సుభాష్‌నగర్: గాజులరామానికి చెందిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గాజులరామారం చౌరస్తాలో సరస్వతి పుష్కరాల నది జలాలను పంపిణీ చేశారు. పుష్కరాలకు వెళ్లలేని 1500 మందికి జలాలను అందజేసినట్లు సంఘం సభ్యులు తెలిపారు.

సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శిగా ఉమామహేష్



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సీపీఐ కార్యదర్శిగా ఉమామహేష్ ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని ఈసీఐఎల్‌లో జరిగిన మేడ్చల్ జిల్లా 4వ మహాసభల్లో కుత్బుల్లాపూర్ మండలానికి చెందిన ఉమామహేష్‌ను జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. గతంలో ఆయన సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. మహాసభల్లో సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర, జిల్లా నాయకులు వీఎస్‌బోస్, యూసుఫ్ ,దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గం, కౌన్సిల్‌ను సోమవారం అధికారికంగా ప్రకటించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

కేపీహెచ్‌బీకాలనీ: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం కేపీహెచ్‌బీ, సర్దార్‌పటేల్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామిని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఎమ్మెల్యేను ఆశీర్వదించారు.

మూడు నెలల రేషన్.. ఒకేసారి !

- జూన్ 1 నుంచి పంపిణీకి ఏర్పాట్లు
- రెండు సర్కిళ్ల పరిధిలో 1,29,013 లక్షల కార్డుదారులు
- సర్కిళ్ల వారీగా అధికారుల ప్రణాళిక



కుత్బుల్లాపూర్: రానున్న మూడు మాసాలకు ఒకేసారి రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ప్రకృతి విపత్తుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో జిల్లా అధికారులు సర్కిళ్ల వారీగా సన్న బియ్యం రేషన్ దుకాణాలకు తరలించనున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్- గండి మైసమ్మ మండలం, బాచుపల్లి మండలం, కుత్బుల్లాపూర్ మండలం పరిధిలో జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు నెల మొత్తం రేషన్ దుకాణాలు తెరిచి మొత్తం 1,29,013 లక్షల కార్డుదారులకు మూడు నెలల రేషన్ పంపిణీ చేసే విధంగా పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిల్లో పరిధిలో ఉన్న ఎనిమిది డివిజన్లలో రేషన్ దుకాణ యజమానులతో సమావేశమై తగిన సూచనలను జారీ చేశారు. జూన్, జూలై, ఆగస్టు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జంట సర్కిళ్లలో..

ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన కొత్త రేషన్ కార్డులకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. అలాగే కార్డులో కొత్తగా నమోదైన సభ్యులకు కూడా వర్తిస్తుంది. గాజులరామారం -13, జగద్గిరి గుట్ట - 13, చింతల్ - 12, సూరారం - 21 మొత్తం 59 రేషన్ దుకాణాలు ఉన్నాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్లో రంగారెడ్డినగర్ - 11, సుభాష్ నగర్ - 16, కుత్బుల్లాపూర్ - 18, జీడిమెట్ల - 6 రేషన్ దుకాణాలు. మొత్తం జంట సర్కిళ్లలో 110 రేషన్ దుకాణాల్లో ఈ పంపిణీ ప్రక్రియ కొనసాగనుంది. బియ్యం పక్కదారి పట్టకుండా విజిలెన్స్ అధికారులతో ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిసింది.

మండలాల వారీగా పంపిణీ ప్రక్రియ ఇలా..

- గండి మైసమ్మ దుండిగల్ మండల పరిధిలో 21 రేషన్ షాపులు ఉన్నాయి. వీటిలో 17,514 కార్డుదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెల 1058.493 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేయనున్నారు.
- కుత్బుల్లాపూర్ మండల పరిధిలో గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిల్ 110 రేషన్ షాపులు ఉన్నాయి. వీటిలో 1,03,000 కార్డుదారులు ఉన్నారు. వీరికి 3 నెలలకు గాను 6471.174 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు.
- బాచుపల్లి మండల పరిధిలో 10 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 8499 మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరికి మూడు నెలలకు గాను 500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేయనున్నారు. జూన్ 1వ తేదీ 8 ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు అన్ని రేషన్ దుకాణాలు తెరిచి ఉండాలని పౌరసరఫరాల శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ముప్పిడి సంగయ్యకు రూ.60 వేలు, బొట్టు లతకు రూ.60 వేలు, గౌరబోయిన రాజమ్మకు రూ.28.50 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతున్న పథకాలతో పేద ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సొంతింటి కలను.. నెరవేర్చిన ఘనత బీఆర్ఎస్‌దే..



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

- బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లోని డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం ఆవరణలో ఆదివారం 2 బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ ఫ్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు ఒక్కతాటిపై ఉండి సమస్యలు లేని సముదాయంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత

గాజులరామారం డివిజన్ వీనస్ రాక్స్ హైట్స్‌లో రూ.36.80 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు విజయ్‌రామ్‌రెడ్డి, నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్, చెట్ల వెంకటేష్, సాయి, చిన్నా చౌదరి, కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు సాదుల వేణు, ప్రధాన కార్యదర్శి ఎస్.కె.వలీ, కోశాధికారి బింగి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట: దైవ నామ స్మరణతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి రింగ్ బస్తీలోని పాతాలేశ్వర్ హనుమాన్ ఆలయంలో ఆదివారం నిర్వహించిన 'హరే రామ హరే కృష్ణ' జప కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు మెట్ల శ్రీను, జైహింద్, ముంతాజ్, శ్రీ పాతాలేశ్వర్ హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులు నందు గుప్తా, జితేందర్ పటేల్, సురేంద్ర యాదవ్, రాజ్ కుమార్, రాజు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా స్తంభాలు!



వేలాడుతున్న కేబుల్‌వైర్లు

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అనేక చోట్ల కరెంట్ స్తంభాలకు కేబుల్ వైర్లు వేలాడుతున్నాయి. మరికొన్ని చోట్ల నేలకు జారి రోడ్డుపై పడ్డాయి. స్థానిక ప్రజలు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. తక్షణం సంబంధిత అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని కూకట్‌పల్లిలో ఆదివారం నిర్వహించిన గ్రామపాలన అధికారి పరీక్షాకేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి పరిశీలించారు. మహిళా డిగ్రీ కళాశాలలో జరుగుతున్న గ్రామపాలన అధికారి పరీక్ష కేంద్రంలోని గదులను కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందా.. అని, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

చెట్టు కొమ్మను తొలగించరా?

జీడిమెట్ల: వర్షానికి విరిగిపడిన కొమ్మను మున్సిపల్ సిబ్బంది తొలగించకపోవడంతో కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి సుభాష్‌నగర్ డివిజన్‌లోని వెంకటాద్రినగర్ నగర్ ఫాక్స్‌సాగర్ రోడ్డులో చెట్టుకొమ్మ విరిగి పడింది. ఈ విషయమై కాలనీవాసులు మున్సిపల్ సిబ్బందికి తెలిపినా కొమ్మను తొలగించలేదని స్థానికులు తెలిపారు. ఆదివారం మొత్తం కొమ్మ అలాగే ఉండటంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఇప్పటికైనా మున్సిపల్ సిబ్బంది పట్టించుకుని రోడ్డుకు అడ్డంగా పడిపోయిన కొమ్మను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



నేడు కేంద్ర మంత్రి రాక

నిజాంపేట్: గాజులరామారం, ప్రగతినగర్ సమీపంలోని ఎలీప్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఎలీప్ సీఎఫ్‌సీ భవనం, కాన్ఫరెన్స్ హాల్‌లో వికసిత్ భారత్ కోసం మహిళా పారిశ్రామికవేత్తలతో 'భవిష్యత్ నిర్మాణం' అనే అంశంపై సోమవారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎలీప్ ప్రెసిడెంట్ రమాదేవి కన్నెగంటి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి జితన్ రామ్ మాంజీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కార్యక్రమంలో ఇన్నోవేషన్, సుస్థిరతపై ప్రేరణాత్మక సెషన్లు, మహిళా పారిశ్రామికవేత్తల విజయ గాథలు, సమగ్ర గ్రీన్ పారిశ్రామిక అభివృద్ధిపై చర్చలు, గ్రీన్ పారిశ్రామిక పార్కులు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

వర్షం.. రోడ్లు జలమయం!



ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీ నుంచి సుభాష్‌నగర్‌కు వైపు..



జీడిమెట్ల ఫేజ్ 5లో ఔట్‌లెట్ మూసుకుపోయి రోడ్డుపై పారుతున్న నీరు

జీడిమెట్ల: శనివారం రాత్రి కురిసిన వర్షానికి కొన్ని చోట్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతాల్లో కొన్ని చోట్ల నాలాల ఔట్‌లెట్‌లు మూసుకుపోవడంతో వర్షపు నీరు రోడ్లపై వరదలుగా పారింది. జీడిమెట్ల ఐలాతో పాటు కుత్బుల్లాపూర్ మున్సిపల్ అధికారులు నాలాల్లో ఉన్న చెత్తాచెదారాలను తొలగించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంతో పాటు సుభాష్‌నగర్‌లోని ప్రాంతాల్లో ఔట్‌లెట్‌ల సమస్య ఏర్పడుతుంది. జీడిమెట్ల ఫేజ్ 5లోని మారుతీ సర్వీసింగ్ సెంటర్ వెనకాల నాలా, ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలో ఫాక్స్ సాగర్ ఓవర్‌ఫ్లో కాలువ వద్ద సమస్య తలెత్తుతుంది. కావున ఇప్పటికైనా ఐలా మున్సిపల్ అధికారులు పట్టించుకుని వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆన్ ఆఫ్ లేక.. తాగునీరు వృథా !



గురుమూర్తినగర్‌లోని బెస్ట్ టెక్నో స్కూల్ గల్లీలో రోడ్డుపై పారుతున్న తాగునీరు

రంగారెడ్డినగర్: పై ఫొటోలో పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు పారుతుందనుకుంటే మీరు పొరబడినట్లే. రంగారెడ్డినగర్ డివిజన్ గురుమూర్తినగర్‌లోని పలు ఇళ్లల్లో నుంచి నీటి సంపులు నిండటంతో రోడ్డుపై పారుతుండగా ఆదివారం 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది. గోదావరి జలాలను వదిలిన ప్రతిసారి నల్లాలకు ఆన్, ఆఫ్‌లు లేకపోవడంతో ఇలా రోడ్లపై తాగునీరు పారడం పరిపాటిగా మారింది. ఈ విషయమై జలమండలి అధికారులకు ఫిర్యాదులు అందినా పట్టించుకోవడం లేదు. తాగునీటి సరఫరా, లీకేజీల మరమ్మతుల వరకే తమ పనిగా అధికారులు భావిస్తున్నారు. నీటిని వృథా చేస్తున్న గృహ యజమానులను గుర్తించి చలాన్‌లు విధిస్తే మరోసారి ఇలా చేయరని పలువురు పేర్కొంటున్నారు. జలమండలి అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటారో? లేదో? వేచి చూడాల్సిందే.



బహదూర్‌పల్లిలోని ప్రధాన రోడ్డును ఆనుకొని స్థానికంగా ఉన్న కొంతమంది రోడ్ల పక్కనే చెత్తను కుప్పలు కుప్పలుగా పోసి నిప్పు పెడుతున్నారు. దీంతో దట్టమైన పొగలతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - సుభాష్‌నగర్

పడిపోతున్నా పట్టించుకోవట్లే!



దూలపల్లిలోని 16వ వార్డులో తీగలపై ఒరిగిన స్తంభం



అయ్యప్ప కాలనీ రోడ్డు నెంబరు 4లో విరిగిన స్తంభం

సుభాష్‌నగర్: జన ఆవాసాల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి ప్రమాదపుటంచులో ఉన్నాయి. కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని పలు రోడ్లలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయి. ఇటీవల 16వ వార్డులోని మంచినీళ్ల బావి వద్ద ఓ విద్యుత్‌స్తంభం రోడ్డుపై విరిగి పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దూలపల్లిలోని అయ్యప్ప కాలనీ రోడ్డు నెంబర్ 4లోని చర్చి వద్ద ఉన్న 33 కేవీ లైన్ విద్యుత్ స్తంభాన్ని మూడు నెలల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం అడుగుభాగాన విరిగి కేవలం వైర్లపైనే ఆధారపడి ఉంది. దీంతో గాలి వచ్చిన సమయంలో అటూ ఇటూ ఊగడంతో స్థానికులు భయంతో గడుపుతున్నారు. ఒకవేళ ఆ విద్యుత్ స్తంభం ఒరిగి పక్కనే ఉన్న 11కేవీ ప్రధాన లైన్‌పై పడితే భారీ ప్రమాదం పొంచి ఉంది. ఈ విషయమై స్థానికులు అధికారులకు పలుమాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుంటారో? లేదో? చూడాలి.

నత్తనడకన సీసీ రోడ్డు పనులు!

- తేలిన కంకర
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



నూతన రోడ్డు కోసం రోడ్డును తవ్వి కంకర వేసిన దృశ్యం



రోడ్డును మూసివేసిన దృశ్యం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో సీసీ రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండటంతో వాహనదారులు, కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రగతినగర్‌లోని విజేత సూపర్ మార్కెట్ నుంచి వాసవి లేఅవుట్‌లోకి వచ్చే రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణం కోసం పది రోజుల క్రితం రోడ్డును తవ్వి వదిలేశారు. రోడ్డు నిర్మాణం కోసం రోడ్డుకు కనెక్టివిటీ ఉన్న అన్ని రోడ్లను మూసివేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రగతి నగర్‌కు వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన రోడ్ల నిర్మాణం చేసే సమయంలో రద్దీగా ఉన్న రోడ్లలో పనులు నత్తనడకన సాగుతున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దారుల మూసివేతతో తిప్పలు

విజేత సూపర్ మార్కెట్ నుంచి వాసవి లేఅవుట్‌కు వచ్చే మార్గాన్ని, అదేవిధంగా ఆదిత్య గార్డెన్ నుంచి వాసవి లే అవుట్‌కు వచ్చే మార్గాన్ని, వాసవి లే అవుట్ నుంచి ప్రగతి నగర్‌కు వెళ్లే మార్గాన్ని, సాయి నగర్ నుంచి వాసవి లే అవుట్ మీదుగా ప్రగతినగర్‌కు వెళ్లే మార్గాన్ని మూసివేయడంతో వాహనదారులు ప్రతి రోజు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజేత సూపర్ మార్కెట్ నుంచి వాసవి లే అవుట్‌కు వచ్చే రోడ్డును ముందుగా నిర్మాణం చేసి తర్వాత సాయినగర్, ప్రగతి సెంట్రల్ స్కూల్ వైపు వెళ్లే రోడ్డును నిర్మాణం చేసి ఉంటే వాహన దారులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చేవికావు. కానీ ఇవేమీ పట్టించుకోకుండా ఒక్కసారిగా అధికారులు ఇష్టానుసారంగా పనులను రెండు వైపుల ప్రారంభించడంతో తిప్పలు తప్పడం లేదు. ప్రారంభించిన పనులనైనా వేగంగా పూర్తి చేసిన సరిపోయేది. కానీ రోడ్లను తవ్వి పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. ప్రస్తుతం వర్షాలు సైతం పడుతుండటంతో తవ్విన రోడ్లలో వర్షం నీరు నిలిచి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.